# వరంగల్ వాయిస్

Evening Daily

సంపుటి : 05 | సంచిక : 028
పేజీలు : 08 | వెల: రూ.5/-

సోమవారం
జనవరి 05, 2026

www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## అర్జీలు పెండింగ్ లో ఉండొద్దు



- గ్రీవెన్స్ వినతులు త్వరితగతిన పరిష్కరించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

2లో..

# డూప్లికేట్







- బ్రాండెడ్ పేరుతో నకిలీ వస్త్రాల విక్రయం
- హైకోర్టు ఆదేశంతో రంగంలోకి ఢిల్లీ పోలీసులు
- బట్టల దుకాణాల్లో విస్తృత తనిఖీలు
- పెద్ద మొత్తంలో నాసిరకం వస్త్రాల పట్టివేత
- ఓరుగల్లులో కలకలం

కాదేదీ కల్తీకి అనర్హం అన్నట్లుగా మారింది ప్రస్తుత పరిస్థితి. కల్తీ మద్యం.. నాసిరకం విత్తనాలు, త్వరగా పాడయ్యే గృహోపకరణాలు ఇలా అంతటా సెకండ్, థర్డ్ క్వాలిటీ వస్తువుల విక్రయాల దందా పెరిగిపోయింది. అసలైన బ్రాండ్ల పేరుతో నకిలీ వస్తువులను అంటగడుతూ కొందరు వ్యాపారులు భారీ లాభాలు గడిస్తున్నారు. నకిలీ వస్త్రాల విక్రయంపై ఒరిజినల్ కంపెనీ యజమానులు హైకోర్టును ఆశ్రయించారు. వర్జినల్ కంపెనీల పేర్లు ఉపయోగిస్తూ నకిలీ వస్త్రాలు అమ్ముతున్న వ్యాపారులపై కొరడా ఝులిపించలంటూ విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఆదేశాలతో రంగంలోకి దిగిన ఢిల్లీ పోలీసుల బృందం వరంగల్ బట్టలబజార్ లోని పలు దుకాణాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. అడ్వకేట్‌తో కలిసి వరంగల్ పోలీసులు సైతం వారికి సహాయ సహకారాలు అందించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఒక వర్గం వ్యాపారస్తులు నకిలీ వస్త్రాలు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. వారినుంచి బ్రాండెడ్ పేరుతో విక్రయిస్తున్న నకిలీ వస్త్రాలను పెద్దమొత్తంలో స్వాధీనం చేసుకున్నారు. దీంతో నకిలీ వస్త్రాల విక్రయం ఓరుగల్లులో కలకలం సృష్టించింది. గతంలోనూ ఇదే తరహా విక్రయాలు జరిగినప్పటికీ పోలీసులు కేసు పెట్టి చేతులు దులుపుకున్నారన్న ఆరోపణలున్నాయి. రూ.30వేల ధర పలికే పోచంపల్లి ఇక్కత్ చీరలు సెకండ్ క్వాలిటీ పేరిట రూ.1,200, రూ.7వేల విలువైన చీరలను రూ.300 లకే అమ్ముతున్న సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఇప్పటికైనా తనిఖీ అధికారులు నాసిరకం వస్త్రాలపై దృష్టి సారించాలన్న డిమాండ్ పెరుగుతోంది.

–వరంగల్ వాయిస్ ప్రతినిధి







7లో..

## రాజకీయాల్లో రాణించాలి

- సర్పంచులుగా గుర్తింపు తెచ్చుకోవాలి
- గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి



## మహా జాతరకు రండి

- సీఎంను ఆహ్వానించిన మంత్రులు

ఈ నెల 28 నుంచి నాలుగు రోజుల పాటు నిర్వహించనున్న అతిపెద్ద ఆదివాసీ గిరిజన ఆధ్యాత్మిక వేడుక మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మహాజాతరకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆహ్వానించారు. సోమవారం మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ సీతక్క, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తో పాటు మేడారం ఆలయ పూజారులు అసెంబ్లీ ఛాంబర్‌లో ముఖ్యమంత్రిని కలిసి జాతర ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర పోస్టర్‌ను రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. – వరంగల్ వాయిస్, హనుమకొండ






2లో..

## వరంగల్ వాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జనవరి 05, 2026

# అర్జీలు పెండింగ్ లో ఉండొద్దు

- గ్రీవెన్స్ వినతులు త్వరితగతిన పరిష్కరించాలి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రీవెన్స్ లో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అర్జీదారుల నుంచి కలెక్టర్ దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులను సత్వర చర్యలు చేపట్టాలన్నారు. దరఖాస్తుల పరిష్కార స్వభావాలను వెబ్ సైట్ లో అప్‌లోడ్ చేయాలన్నారు. రిమార్కులు లేకుండా దరఖాస్తులను క్లోజ్ చేయరాదన్నారు. అర్జీలు అధికశాతం పెండింగ్‌లో ఉన్న తహాశీల్దార్లు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు తనిఖీ సందర్భంగా అధికారులు ఇందిరమ్మ ఇండ్ల పనుల పురోగతిని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించాలన్నారు. అదేవిధంగా ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో అతి తక్కువ శాతంగా ఉందని మండల ప్రత్యేక అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బీఎల్ఓలు, ఆర్పీలు డోర్‌టు డోర్ వెళ్లి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలన్నారు. నలబై సంవత్సరముల పైబడిన, నలభై సంవత్సరములలోపు వయస్సు కలిగిన వారి కుటుంబ సభ్యుల వివరాలతో 2002 ఓటర్ల జాబితా 2025 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రీవెన్స్ లో ప్రజలనుంచి 153 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి వైవి గణేష్, పరకాల, హనుమకొండ ఆర్డీవోలు డాక్టర్ కన్నం నారాయణ, రాథోడ్ రమేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బల్దియాలో..**

ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ అని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అభిప్రాయపడ్డారు. బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో సోమవారం కమిషనర్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వాటి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా టౌన్ ప్లానింగ్ విభాగంలో అత్యధికంగా 45 వినతులు వచ్చాయి. ఇంజనీరింగ్ విభాగంలో 22, రెవెన్యూ శాఖకు సంబంధించినవి 15, హెల్త్ శానిటేషన్ విభాగానికి ఐదు, నీటి సరఫరాకు చెందినవి రెండు, హార్టికల్టర్ విభాగానికి ఒకటి చొప్పున మొత్తం     మొత్తం వినతులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్. ఎస్ఈ సత్యనారాయణ, సీహెచ్ఓ రమేష్, డీఎఫ్ఓ శంకర్ లింగం, ఇంచార్జి సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ లు ప్రసన్న రాణి, సమ్మయ్య, టీఓ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## సీపీని కలిసిన బండి సుధాకర్ గౌడ్

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్ రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్ సోమవారం మర్యాద పూర్వకంగా కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి భద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న రమేష్ రెడ్డిని ఆయన అభినందించారు. **–వరంగల్ వాయిస్, హైదరాబాద్**



## బీజేపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గా రఘునారెడ్డి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** బీజేపీ వరంగల్ జిల్లా సంస్థాగత కన్వీనర్ గా ఎరుకల రఘునారెడ్డిని నియమించారు. ఈ సందర్భంగా రఘునారెడ్డి మాట్లాడుతూ నాపై నమ్మకంతో పార్టీకి సేవ చేసే అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రాంచందర్ రావు, రాష్ట్ర సంఘటన మంత్రి చంద్రశేఖర్ జీ, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్, వరంగల్ జిల్లా ఇంచార్జి కొండపల్లి శ్రీధర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనను వెన్నుతట్టి ప్రోత్సహిస్తూ ముందుకు నడిపిస్తున్న యువ నాయకులు, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, డాక్టర్ వి.వెంకటరమణ, జిల్లా నాయకులు, మండల అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటానన్నారు. అందరి సహకారంతో పార్టీని బూత్ స్థాయి నుంచి పటిష్ట పరిచి, వరంగల్ జిల్లాలో కాషాయ జెండా ఎగిరేలా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని ఒక ప్రకటనలో తెలిపారు.

# పదేళ్ల సమస్యకు.. పది నిమిషాల్లో పరిష్కారం

**తక్షణ స్పందనతో దరఖాస్తుదారుడి హర్షం**






**వరంగల్ వాయిస్, వరంగల్ :** పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉండి పరిష్కారం కాని సమస్యను, సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణిలో కేవలం పది నిమిషాల వ్యవధిలో పరిష్కరించినందుకు దరఖాస్తుదారుడు ఏనుగు సుదర్శన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్యపై తక్షణ స్పందనతో పాటు, బాధితుడి పరిస్థితిని అర్థం చేసుకొని, మానవీయ దృక్పథంతో నిర్ణయం తీసుకున్న కలెక్టర్ కార్యదక్షత, ప్రజల పట్ల ఉన్న బాధ్యతాభావం ప్రశంసనీయం అన్నారు. ప్రజావాణి వంటి ప్రజాసంబంధ కార్యక్రమానికి నిజమైన అర్థాన్ని కల్పిస్తూ, ప్రజల నమ్మకాన్ని మరింత బలపరిచిచారన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమస్య ఏదైనా ప్రశాంతంగా పరిష్కారం అవుతుందని దరఖాసుదారులకు భరోసా ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమం లో ప్రజల సమస్యలకు పరిష్కారం దిశగా ఒక ముఖ్య వేదికగా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, జడ్పీ సీఈవో రామ్ రెడ్డి, డీఆర్ఓ విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డీఎంహెచ్ ఓసాంబశివరావు, డీడబ్ల్యూఓ రాజమణి, వరంగల్ ఆర్డీఓ ఏవో ఫణికుమార్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను వినతిపత్రాల రూపంలో కలెక్టర్‌కు అందజేశారు. ఈరోజు స్వీకరించిన మొత్తం 151 దరఖాస్తుల్లో రెవెన్యూ శాఖకు సంబంధించి 59, జీడబ్ల్యూఎంసీకి 20, డీఆర్ డీఓ, డీపీఓలకు 11 చొప్పున దరఖాస్తు రాగా వివిధ శాఖలకు సంబంధించిన దరఖాస్తులు 50 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. సమస్య ఎందుకు పరిష్కారం కావడంలేదన్న అంశంపై సంబంధిత శాఖ అధికారులతో నేరుగా దరఖాస్తు దారిని సమక్షంలో మాట్లాడించి సమస్యను త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిందిగా సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా భూ సమస్యలు, పింఛన్లు, గృహాలు, ఉపాధి, సంక్షేమ పథకాలపై వచ్చిన వినతులను పరిశీలించి అర్హతమేరకు పరిష్కరించాలని సంబంధిత అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## వరంగల్ వాయిస్ క్యాలెండర్ ఆవిష్కరణ

సీనియర్ జర్నలిస్ట్, ప్రజా పక్షపాతి గడ్డం కేశవమూర్తి ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలకు నిత్యం మెరుగైన వార్తలు అందిస్తూ పత్రికా రంగంలో చెరగని ముద్ర వేస్తున్న వరంగల్ వాయిస్ ఈవెనింగ్ దిన పత్రిక నూతన సంవత్సర క్యాలెండర్ ను సోమవారం ఆవిష్కరించారు. హనుమకొండ ఇన్ స్పెక్టర్ మచ్చ శివ కుమార్, హనుమకొండ ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ సీతా రెడ్డి, కేయూ ఇన్ స్పెక్టర్ రవి కుమార్, ఎస్సై విజయ్ కుమార్, విశ్వ బ్రాహ్మణ యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు, నేచర్ 369 రెస్టారెంట్ యజమాని ఐలాపురం వేణు చారి సమక్షంలో క్యాలెండర్ ను ఆవిష్కరించారు.
**–వరంగల్ వాయిస్, హనుమకొండ**

# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

● సర్పంచ్ వారణాశి మౌనిక అజయ్



**వరంగల్ వాయిస్, రేగొండ :** గర్భిణీలు, బాలింతలు, చిన్నపిల్లలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని రేగొండ గ్రామ సర్పంచ్ వారణాశి మౌనిక అజయ్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని 4వ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె సందర్శించి, అక్కడ లబ్ధిదారులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రానికి విచ్చేసిన సర్పంచ్‌కు చిన్నారులు పూలు ఇచ్చి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా పలువురు చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం మహిళల్లో రక్తహీనత నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పాలు, కోడిగుడ్లు, బాలామృతాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సక్రమంగా పంపిణీ జరగాలని సిబ్బందిని ఆదేశించారు. అంగన్‌వాడీ టీచర్ నామాల రజిత ఆధ్వర్యంలో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్లండి నరేష్, గ్రామ కార్యదర్శి తుల్జారాణి, ఏఎన్ఎం యాదలక్ష్మి, ఆశా కార్యకర్తలు శ్రీలత, హసీనా, సుభద్ర, రజిత, ఇంద్రాదేవి, మహిళా కానిస్టేబుల్ డి.మౌనిక, వీఓ సంఘం అధ్యక్షురాలు సుమలత, రాధిక, బాలింతలు పాల్గొన్నారు.

# ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు నరేష్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రేగొండ మండల ఉపసర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఎల్లండి నరేష్‌ను ఆదివారం హన్మకొండలోని వేద ఫంక్షన్ హాల్‌లో పద్మశాలి సంఘం వివిధ విభాగాల నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, మెమెంటో అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాప్రతినిధిగా నిరంతరం ప్రజల చెంతనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నరేష్, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిష్ఠించాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో ఆయన చూపిస్తున్న చొరవ అభినందనీయమని కొనియాడారు. ఈ సన్మాన కార్యక్రమంలో వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, మాజీ ఎమ్మెల్యే శ్రీరాములు, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు రాజశేఖర్ పాల్గొన్నారు. వీరితో పాటు వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, డీమ్ బాయ్ టీవీ సీఈవో వేముల సదానందం, వరంగల్ జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల ప్రెసిడెంట్ మెండు రవీందర్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గడ్డం కేశమూర్తి, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి కూరపాటి రమేష్ తదితరులు పాల్గొని నరేష్‌ను అభినందించారు.

# సరదా టెడ్డి.. మనసు నిండా నవ్వు

## యువకుడు రోహిత్ వినూత్న ప్రయత్నం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నేటి ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడి, టెన్షన్లతో సతమతమవుతున్న ప్రజల ముఖాల్లో చిరునవ్వు నింపడమే లక్ష్యంగా హనుమకొండకు చెందిన గ్రాడ్యుయేట్ యువకుడు రోహిత్ చేస్తున్న ప్రయత్నం అందరినీ ఆకర్షిస్తోంది. తన స్నేహితులతో కలిసి 'టెడ్డి' వేషం ధరించి, పిల్లలతో పాటు పెద్దలను నవ్విస్తూ వినోదాన్ని పంచుతున్నాడు. గత కొన్ని నెలలుగా రోహిత్ తన మిత్ర బృందంతో కలిసి ఆదివారాలు, ఇతర సెలవు దినాల్లో హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాడు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా, కేవలం ఎదుటివారి సంతోషం కోసమే రోహిత్ చేస్తున్న ఈ ప్రయత్నంపై సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. రోహిత్ చేస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని గమనించిన ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్, అతనితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎటువంటి ప్రతిఫలం ఆశించకుండా సమాజానికి ఆనందాన్ని పంచడం గొప్ప విషయమని, ఇటువంటి కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని ఆయన అభినందించారు. భవిష్యత్తులో ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. యువత సామాజిక బాధ్యతను గుర్తించి, నవ్వును ఒక సందేశంగా మార్చడం ప్రేరణాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్మల శ్రీనివాస్‌తో పాటు సంధ్య, రోహిత్ మిత్రులు నందకిషోర్, భరత్, విష్ణు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం రోగులకు పండ్ల పంపిణీ చేశారు. అంబేద్కర్ నేషనల్ అవార్డు గ్రహీత శనిగరపు రాజేందర్, అంబేద్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడి కుమారుడైన సుకుమార్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, గర్భిణీలకు పండ్లు పంపిణీ చేస్తూ వారికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకలను ఆడంబరాలకు పోకుండా ఇలా ఆసుపత్రిలో పేద రోగుల మధ్య జరుపుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ సేవా కార్యక్రమంలో డాక్టర్ అల్లూరి అనూష, డాక్టర్ సుచరిత, అంబేద్కర్ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులు, 2వ వార్డు సభ్యులు తిక్క సంపత్, ముల్కనూరి కొమురయ్య పాల్గొన్నారు. అలాగే ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షులు దూడపాక శ్రీనివాస్, మండల నాయకులు వడ్ల యాదగిరి, ఇంజపెల్లి రవికుమార్, ఆరుముళ్ళ ప్రభాకర్, ఆసుపత్రి సిబ్బంది సుధాకర్, రజిత, స్వరూప, ఫరీదా తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# మడికొండ పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, కాజీపేట :** మడికొండ పద్మశాలి పరపతి సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అభ్యున్నతికి, సభ్యుల సంక్షేమానికి కట్టుబడి పనిచేసే సమర్థవంతమైన నాయకత్వాన్ని సభ్యులు ఎంచుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా తాటిపాముల సత్యనారాయణ, ఉపాధ్యక్షులు నల్ల హేమంత్, ప్రధాన కార్యదర్శి కోమాకుల సమ్మయ్య, సహాయ కార్యదర్శి గుర్రపు జగదీశ్వర్, కోశాధికారి పొట్లబత్తిని లక్ష్మణ్, ఇతర సభ్యులకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ సభ్యులందరికీ పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కుల బాంధవుల ఐక్యత కోసం, సంఘం ఆర్థిక పురోభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. నూతన కార్యవర్గానికి సంఘంలోని పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

# ముదిరాజ్ చరిత్రను మనమే రాసుకోవాలి

◆ సోనబోయిన సతీష్ ముదిరాజ్




**వరంగల్ వాయిస్, గుంటూరు :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు నగరంలోని పోలేరమ్మ దేవస్థానం ప్రాంగణంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం వైభవంగా నిర్వహించబడింది. ముదిరాజ్ యువసేన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు గూడూరు నాని ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణకు చెందిన ప్రముఖ ముదిరాజ్ అధ్యయన పరిశోధకులు సోనబోయిన సతీష్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సతీష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. "తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలు విడిపోయినా ముదిరాజులందరూ ఒకే తల్లి బిడ్డలని, అన్నదమ్ముల్లా ఐక్యంగా ఉండి మన హక్కుల కోసం పోరాడాలని" పిలుపునిచ్చారు. ముదిరాజులను బీసీ-డీ నుంచి బీసీ-ఏ జాబితాలోకి మార్చే ఉద్యమానికి యువతే వెన్నెముకగా నిలవాలని స్పష్టం చేశారు. విద్యను ఆయుధంగా చేసుకున్నప్పుడే రాజకీయంగా, సామాజికంగా ఎదగడం సాధ్యమవుతుందని ఆయన ఉద్ఘాటించారు. తెలుగు భాషలో తొలి శాసనం వేయించిన ఎరికల్ ముత్తురాజు ధనుంజయ రాజు మన జాతికి చెందిన వ్యక్తి కావడం అత్యంత గర్వకారణమని సతీష్ ముదిరాజ్ పేర్కొన్నారు. ఆ మహనీయుడి చరిత్రను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 5వ తరగతి పాఠ్యపుస్తకంలో చేర్చడం మన జాతికి లభించిన గొప్ప గౌరవమని, ఇది రాబోయే తరాలకు మన మూలాలను పరిచయం చేస్తుందని తెలిపారు. ధనుంజయ రాజు స్ఫూర్తితో ముదిరాజులందరూ ఏకతాటిపైకి రావాలని కోరారు. అనంతరం ముదిరాజ్ జాతి సంస్కృతి, చరిత్రను ప్రతిబింబించేలా రూపొందించిన ముదిరాజ్ క్యాలెండర్‌ను నాయకులు ఘనంగా ఆవిష్కరించారు. ఈ క్యాలెండర్ ప్రతి ఇంట్లో ఉండాలని, ఇది జాతి చరిత్రపై అవగాహన పెంచుతుందని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ యువసేన ప్రతినిధులు, సంఘం నాయకులు, పెద్ద సంఖ్యలో యువత పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం తురకల సోమారం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. గోదావరిఖని నుంచి బూరుగుమల్ల గ్రామంలో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు మహబూబ్ అనే వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి ఎర్టిగా కారులో వస్తుండగా, కారు అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. తెల్లవారుజామున పొగమంచు దట్టంగా ఉండటం వల్ల రహదారి సరిగా కనిపించక ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి గాయాలయ్యాయి. అందులో ఒక వ్యక్తికి కాలు విరిగినట్లు స్థానికులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

## అన్నారం దర్గా ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన అన్నారం షరీఫ్ దర్గా ఉర్సు ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుండే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా భక్తులు భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. ముజావార్లు తెలిపిన వివరాల ప్రకారం.. మొదటి రోజు రాత్రి గంధం సమర్పణ, సందల్ ఊరేగింపు నిర్వహించనున్నారు. రెండవ రోజు రాత్రి దీపారాధన, అనంతరం భారీ ఎత్తున మహా అన్నదాన కార్యక్రమం ఉంటుంది. మూడవ రోజు ఖథముల్ ఖురాణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఈ వేడుకలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పర్వతగిరి సీఐ బి.రాజగోపాల్ ఆధ్వర్యంలో సుమారు 100 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఉపాధి హామీ పనుల ప్రారంభం



**వరంగల్ వాయిస్, గణపురం:** మండల కేంద్రమైన గణపురంలో ఉపాధి హామీ పథకం పనులను గ్రామ సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ సోమవారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కూలీలతో కలిసి పనుల్లో పాల్గొన్న వారు, పథకం అమలు తీరుపై పలు సూచనలు చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలు ప్రభుత్వం నిర్దేశించిన జరిష్ విధానంలోనే తమ హాజరును నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ రెండు పూటలా హాజరు ఉంటుందని, కూలీలందరూ సమయపాలన పాటించాలని కోరారు. పని చేసే ప్రతి కూలీకి గరిష్టంగా 307 రూపాయల వేతనం పడే విధంగా కొలతల ప్రకారం పనులు చేయించాలని ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవికి సూచించారు. కూలీలకు పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిగినేని బాబురావు, తడక సాంబయ్య, వైనాల వెంకటేశ్వర్లు, యువజన నాయకులు మచిక రక్షిత్, శివ, రావుల సురేష్ మరియు ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రాష్ట్ర ప్రభుత్వం చేనేత పరిరక్షణకు, నేతన్నల సంక్షేమానికి రానున్న బడ్జెట్లో రూ.2000 కోట్లు కేటాయించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ కొత్తవాడలోని చేనేత కార్మిక పరపతి సంఘం కార్యాలయంలో 2026 నూతన క్యాలెండర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకట్రాములు మాట్లాడుతూ.. పాలకులు మారుతున్నా నేతన్నల తలరాతలు మారడం లేదని, వారి బతుకులు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. క్రమం తప్పకుండా క్యాలెండర్‌ను రూపొందిస్తున్న పరపతి సంఘం పాలక మండలిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కూచన సారయ్య, ప్రధాన కార్యదర్శి లింగబత్తిని రామకృష్ణ, నాయకులు బొద్దుల బిక్షపతి, బాసబత్తిని శంకరయ్య, పెండ్యాల రాజేంద్రచారి, శంకర్, ప్రశాంత్, పుణ్యవతి, రాధ పాల్గొన్నారు.

## ప్రభుత్వ బడుల బలోపేతమే 'స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ' లక్ష్యం

**వరంగల్ వాయిస్, కాజీపేట :** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థుల సంఖ్యను పెంచడం, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడటమే లక్ష్యంగా 'స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ' ఆవిర్భవించింది. ఆదివారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం పోచంపల్లి ప్రభుత్వ పాఠశాలలో బోయినపల్లి రాధా అధ్యక్షతన ఈ సొసైటీ ఆవిర్భావ సమావేశం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా సొసైటీ లోగోను, కార్యక్రమాలను లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి గణేష్ మాట్లాడుతూ.. 'గివ్ బ్యాక్ టు సొసైటీ' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. పాఠశాలల్లో పర్యావరణ స్పృహ పెంచాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణలో 15 అశోక వృక్షాలను నాటారు. గౌరవ అతిథిగా హాజరైన మాజీ డీఈఓ కె.నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. స్ప్రింగ్ సొసైటీ విద్యాశాఖకు సలహాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.





ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల నైపుణ్యాల అభివృద్ధికి సొసైటీ చేస్తున్న కృషిని అభినందించారు.స్ప్రింగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు సొసైటీ లక్ష్యాలను వివరిస్తూ.. మొదటి విడతగా 5 పాఠశాలలను దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. 14 పాఠశాలలకు ఒక్కొక్కటి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2 లక్షల విలువైన అవసరమైన వస్తువులను పంపిణీ చేశారు. 'సీ' గ్రేడ్ విద్యార్థుల కోసం వలంటీర్ల నియామకం, స్పోకెన్ ఇంగ్లీష్, కాలిగ్రఫీ, డ్రాయింగ్, డాన్స్, క్రీడల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ వేదికపై జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ అలీమ్, రిటైర్డ్ కలెక్టర్ మోహన్ లాల్, రిటైర్డ్ డీఎఫ్ఓ పురుషోత్తం, సభ్యులు వెంకట్ రామ్ రెడ్డి, ఉప్పలయ్య, సుమిత్ర, శోభ, విజయలక్ష్మి, విజయ, రవికుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

## కనుకుంట్ల సుధాకర్‌కు 'మహోన్నత పోలీసు సేవా పథకం'



**వరంగల్ వాయిస్, వరంగల్:** తెలంగాణ ట్రాన్స్‌కోలో ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న కనుకుంట్ల సుధాకర్ తన అద్భుతమైన సేవలకు గాను ప్రభుత్వం ప్రకటించే 'మహోన్నత పోలీసు సేవా పథకం'నకు ఎంపికయ్యారు. ఆయన ఈ గౌరవానికి ఎంపిక కావడం పట్ల తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. సుధాకర్ తన విధి నిర్వహణలో ప్రదర్శించిన అంకితభావం, నిబద్ధతకు ఈ పురస్కారం నిదర్శనమని సంఘం నేతలు కొనియాడారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పురస్కారాలు అందుకోవాలని ఆకాంక్షించారు. మహోన్నత సేవ పథకం పొందిన సుధాకర్ ను అభినందించిన వారిలో పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా అధ్యక్షులు కోడం రవి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గుర్రపు రాజమౌళి, అసోసియేట్ ప్రెసిడెంట్లు కొండ శ్రీనివాస్, ఆర్గనైజేషన్ కార్యదర్శి కొండబత్తుల రాజమౌళి, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గోరంటాల అశోక్, మాచర్ల శివప్రసాద్, ముదుతనపల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

## క్రీడాకారిణి దీప్తికి రాష్ట్ర ప్రభుత్వం అండ

### మంత్రి శ్రీహరిని కలిసిన దీప్తి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెద గ్రామానికి చెందిన గర్వకారణం, పారా ఒలింపిక్ మెడలిస్ట్ జీవంజి దీప్తి సోమవారం రాష్ట్ర పశుసంవర్ధక, క్రీడలు,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరిని, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలిపి ఆశీస్సులు తీసుకున్నారు. రాబోయే ఏషియన్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనబోతున్నట్లు ఈ సందర్భంగా దీప్తి వారికి వివరించారు. తన ప్రాక్టీస్ వివరాలను, సాధిస్తున్న ప్రగతిని మంత్రికి తెలియజేశారు. దీనిపై మంత్రి వాకిటి శ్రీహరి సానుకూలంగా స్పందిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం తరపున దీప్తికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని, క్రీడల్లో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని భరోసా ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటుతున్న దీప్తిని వారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో దీప్తి వెంట ఆమె తల్లిదండ్రులు ధనమ్మ, యాదగిరి ఉన్నారు.

## విద్యార్థి ఉద్యమాలు ఉధృతం చేయాలి

### ◆ ఘనంగా పీడీఎస్ యూ రాష్ట్ర మహాసభలు




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** శాస్త్రీయమైన, సమానమైన విద్యా విధానం కోసం విద్యార్థులు ప్రగతిశీల ఉద్యమాలు నిర్వహించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పిలుపునిచ్చింది. తెలంగాణ రాష్ట్ర 23వ రాష్ట్ర మహాసభల సందర్భంగా సోమవారం హనుమకొండ ఏకశిలా పార్క్ నుంచి కాకతీయ యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ గ్రౌండ్ వరకు విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభకు పీడీఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్ అధ్యక్షత వహించారు.సభలో ముఖ్య వక్తలుగా పీడీఎస్ యూ పూర్వ అధ్యక్షులు పి.ప్రసాద్, సాధినేని వెంకటేశ్వరరావు, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ నాయకులు వి.సంధ్య ప్రసంగించారు. జార్జిరెడ్డి ప్రేరణతో ఆవిర్భవించిన పీడీఎస్ యూ, ఐదు దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం సమరశీల పోరాటాలు నిర్వహిస్తోందని కొనియాడారు. దేశంలో ప్రజాస్వామ్యం తీవ్ర సంక్షోభంలో ఉందని, బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం వల్ల పౌరుల భవిష్యత్తు ఆందోళనకరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం స్వదేశీ జపం చేస్తూనే, విద్యను వ్యాపార సరుకుగా మారుస్తోందని వారు దుయ్యబట్టారు. విదేశీ, ప్రైవేటు యూనివర్సిటీలకు విచ్చలవిడిగా అనుమతులు ఇస్తూ ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. బడ్జెట్లో విద్యకు అధిక నిధులు కేటాయించాలని, నాణ్యమైన విద్యను అందరికీ ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగానికి విఘాతం కలిగించే ప్రభుత్వాల తీరుపై విద్యార్థి లోకం ఐక్యంగా పోరాడాలని కోరారు. ఈ సభలో పీడీఎస్ యూ పూర్వ అధ్యక్షులు ఎం.శ్రీనివాస్, జేఎన్‌యూ నాయకులు సౌరవ్, పంజాబ్ స్టూడెంట్స్ యూనియన్ అధ్యక్షుడు ధీరద్, ఏపీ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు భాస్కర్, వినోద్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు ప్రసంగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భువనగిరి మధు, రాజేశ్వర్, కోశాధికారి రానా ప్రతాప్, వరంగల్ జిల్లా నాయకులు గుర్రం అజయ్, మర్రి మహేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జనవరి 05, 2026

# యథేచ్ఛగా మొరం అక్రమ రవాణా

• టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు
• రంగంలోకి దిగిన పోలీసులు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి :** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులో అక్రమ మొరం రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ఎస్సారెస్పీ కెనాల్ కాలువ పరిసరాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా మొరం తరలిస్తున్న టిప్పర్ వాహనాలను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. ఈ అక్రమ దందాపై స్థానికులు వెంటనే డీసీపీ అంకిత్ కుమార్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుంటున్నారని తెలుసుకున్న వాహనదారులు తమ టిప్పర్లతో అక్కడి నుంచి పరారయ్యారు. అయితే, పోలీసులు సకాలంలో స్పందించి ఒక టిప్పర్ వాహనాన్ని వెంబడించి స్వాధీనం చేసుకున్నారు. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు అక్రమంగా మొరం తరలిస్తున్నా, స్థానిక రెవెన్యూ , ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాల వల్ల ఎస్సారెస్పీ కెనాల్ కబ్జా సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో కూడా ఇదే కాలువలో అక్రమంగా పైపులైన్లు తొలగించి, కబ్జాకు పాల్పడిన ఉదంతాలు ఉన్నాయని స్థానికులు గుర్తు చేస్తున్నారు. అధికారుల అండదండలతోనే ఈ అక్రమ రవాణా సాగుతోందని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, కాలువను రక్షించడంతో పాటు అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజలు పైరవీకారులను నమ్మవద్దు

**జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజాదివాస్' కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పాల్గొని బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో ఆయన నేరుగా మాట్లాడి, మొత్తం 15 ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల సమస్యలను ఓపికగా విన్న ఎస్పీ, వాటి పరిష్కారానికి సంబంధిత పోలీస్ స్టేషన్ల సీఐలు, ఎస్ఐలతో ఫోన్లో మాట్లాడారు. చట్టపరిధిలో బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని, సమస్యల పరిష్కారంలో జాప్యం చేయరాదని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ఎలాంటి పైరవీలు చేయాల్సిన అవసరం లేదని, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్ అధికారులను కలిసి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. చట్టబద్ధమైన విధానంలోనే ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు చేరువగా ఉండడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ ప్రజాదివాస్ కార్యక్రమం ద్వారా ప్రజల ఫిర్యాదులను నేరుగా స్వీకరించి, సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

## సర్పంచ్ దుబాసి నవీన్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, దామెర :** ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలి డాక్టర్స్ అసోసియేషన్, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం, పద్మశాలి జర్నలిస్టుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించిన పద్మశాలి ప్రజాప్రతినిధుల సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేదికపై దామెర మండలం దమ్మన్నపేట గ్రామ సర్పంచ్‌గా నూతనంగా ఎన్నికైన దుబాసి నవీన్‌ను వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుబాసి నవీన్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, మాజీ జడ్పీ చైర్మన్ సాంబారి సమ్మారావు, అఖిల భారత పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండు రాజశేఖర్, వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు, డీమ్ బాయ్ టీవీ సీఈవో వేముల సదానందం, జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల ప్రెసిడెంట్ మెండు రవీందర్, మాజీ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గడ్డం కేశమూర్తి, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూరపాటి రమేష్, రాధిక తదితరులు పాల్గొని నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను అభినందించారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



**వరంగల్ వాయిస్, వరంగల్** ఎంజీఎం ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని ఎంజీఎం సూపరింటెండెంట్ డా.హరీష్ చంద్రారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం సూపరింటెండెంట్ కార్యాలయంలో ఐఎన్‌టీయూసీ (INTUC 3194) ఎంజీఎం బ్రాంచ్ అధ్యక్షురాలు శాంతి కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన 2026 నూతన సంవత్సర వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎంవోలు డా.రఘునాథస్వామి, డా.మధుకర్ యాదవ్, డా.అశ్విన్, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ప్రీతి సజిని, వర్కింగ్ ప్రెసిడెంట్ కొడిపాక కార్తీక్, కోశాధికారి అడ్లూరి సరళరాణి, నాయకులు అడప వెంకటరమణ, మున్వారున్నిసా, ప్రమీల, మరియమ్మ,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# గుడుల నిర్మాణాలకు స్థలాల నిర్ణయం



**వరంగల్ వాయిస్, గణపురం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల కేంద్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది. వివిధ కుల సంఘాల విజ్ఞప్తి మేరకు, వారి ఆరాధ్య దైవాల ఆలయ నిర్మాణాల కోసం సోమవారం సర్పంచ్ కట్కూరి రాధికా శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థలాల నిర్ణయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ స్థపతి వెంకటేశ్వర్లు, వాస్తు ఆచార్యులు గోవర్ధనం వేణుగోపాలచార్యులు శాస్త్రోక్తంగా స్థలాలను పరిశీలించి ఖరారు చేశారు. గ్రామస్తుల నమ్మకాలు, వాస్తు నియమాలను అనుసరించి గౌడ సంఘం: ఎల్లమ్మ తల్లి ఆలయం, ముదిరాజ్ సంఘం: పెద్దమ్మ తల్లి ఆలయం, యాదవ సంఘం: బీరన్న స్వామి ఆలయం, రజక సంఘం: మడేల్ అయ్యా ఆలయం, గ్రామ దేవత: పోచమ్మ తల్లి ఆలయాల కోసం స్థలాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాధికా శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రేపాక రాజేందర్ మాట్లాడుతూ భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గణపురంలోని దేవాలయాల నిర్మాణాల కోసం సుమారు రూ.2 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే చొరవతోనే నేడు ఆలయ నిర్మాణాలకు మోక్షం కలిగిందని, ఈ నెల 14 నుంచి నిర్మాణ పనులను అధికారికంగా ప్రారంభించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వి.నారాయణ, ఉప సర్పంచ్ ఓరుగంటి కృష్ణ, ప్రముఖులు తాళ్లపల్లి యాదగిరి గౌడ్, బత్తిని శంకర్ గౌడ్, దుగ్యాల దేవేందర్రావు, మాదాసు అర్జున్ గౌడ్, బూర రాజగోపాల్ గౌడ్, సిరిగినేని బాబురావు, మాదాసు రవి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దామెరలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత

**వారం రోజులు పంచాయతీ పాలనపై అధ్యయనం**



**వరంగల్ వాయిస్, దామెర :** వరంగల్ జిల్లా దామెర గ్రామ పంచాయతీలో గ్రూప్-1 అధికారి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ తౌటం రోహిత్ నేత శిక్షణ సోమవారం ప్రారంభమైంది. శిక్షణ కాలంలో భాగంగా గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, పంచాయతీ పాలన తీరుతెన్నులను అధ్యయనం చేసేందుకు జిల్లా కలెక్టర్ ఆయనకు వారం రోజుల పాటు (ఈ నెల 5 నుంచి 11 వరకు )దామెరలో శిక్షణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా దామెర మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది రోహిత్ నేతని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో పాలనపై అవగాహన పెంచుకునేందుకు ఈ వారం రోజుల శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, మండల సిబ్బంది పాల్గొన్నారు.

## శబరిమలకు స్వాముల ప్రయాణం



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రం నుంచి సోమవారం సుమారు 100 మంది అయ్యప్ప స్వాములు శబరిమల యాత్రకు ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు. దీక్షా కాలం ముగియడంతో ఇరుముడులు కట్టుకున్న స్వాములు, తమ ఆశ్రమం నుంచి శబరి యాత్రను ప్రారంభించారు. యాత్రకు ముందు స్వాములు తమ కుటుంబ సభ్యులతో కలిసి "స్వామియే శరణమయ్యప్ప" అంటూ చేసిన శరణు ఘోషలతో పట్టణ వీధులు మారుమోగాయి. ప్రత్యేక అలంకృత వాహనంలో బయలుదేరిన స్వాములకు గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. స్వామి వారి భజనలు, కీర్తనలతో నగర సంకీర్తన నిర్వహిస్తుంటే, పురజనులు భక్తిపారవశ్యంలో మునిగితేలారు. మండల కేంద్రం నుంచి సాగిన ఈ శోభాయాత్ర ఆద్యంతం భక్తిమయంగా సాగింది. ఇరుముడులు ధరించిన స్వాములు శబరి గిరినాథుని దర్శనం కోసం ప్రత్యేక వాహనంలో ప్రయాణమయ్యారు.

## జిల్లా భూకొలతదారుల సంఘం అధ్యక్షుడిగా దేవునూరి రాజు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ జిల్లా అనుమతి పొందిన భూకొలతదారుల సంఘం (2025) నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం రాత్రి రంగాశాయిపేటలోని కార్యాలయంలో ఉత్సాహంగా జరిగాయి. సంఘం న్యాయ సలహాదారులు గోనె విజయ్ రెడ్డి, బర్ల పూర్ణచందర్ పర్యవేక్షణలో ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. జిల్లాలోని సభ్యులందరూ ఏకగ్రీవంగా నూతన బాధ్యులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా దేవునూరి రాజు, కార్యనిర్వాహక అధ్యక్షుడు రంగు శివ, ఉపాధ్యక్షుడిగా జినికిరి రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి గజవెల్లి ప్రదీప్, వరంగల్ విభాగం సమన్వయకర్త మామిడాల సాయి రామ్, మహిళా విభాగం సమన్వయకర్త బలుగురి దీపిక, నర్సంపేట విభాగం సమన్వయకర్త పెంతల విష్ణు, కోశాధికారి ధర్మసోత్ కిరణ్, సలహాదారు ఆవునూరి శివ కుమార్, కార్యదర్శులుగా బొమ్మెర రమ, మరుపట్ల ఏకాంబరం ఎన్నికవగా, జిల్లాలోని 13 మండలాలకు 13 మంది సమన్వయకర్తలు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నిక అనంతరం నూతన అధ్యక్షుడు దేవునూరి రాజు మాట్లాడుతూ.. ప్రభుత్వం తమపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిబద్ధతతో పనిచేస్తామని తెలిపారు. త్వరలోనే జిల్లాలోని 70 గ్రామాల్లో పునః భూకొలతలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భూకొలతదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, సభ్యులందరి ఐక్యతకు నిరంతరం కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

# ముగ్గులు మన సంస్కృతికి ప్రతిబింబాలు

◆ మహిళా కమిటీ అధ్యక్షురాలు బానాల శ్రీ గౌరీ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ముగ్గులు మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలని వీరశైవ లింగాయత్ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా మహిళా కమిటీ అధ్యక్షురాలు బానాల శ్రీ గౌరీ పేర్కొన్నారు. బాలసముద్రంలోని ఏకశిలా పార్కులో లింగాయత్ సమాజ మహిళలకు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీ గౌరీ మాట్లాడుతూ.. ముగ్గులు వేయడం అనేది కేవలం అలంకరణ మాత్రమే కాదని, అది ఆరోగ్యాన్ని, ఆనందాన్ని మేళవించిన ఒక గొప్ప సత్ సంప్రదాయమని కొనియాడారు. నేటి తరం బాలికలకు, యువతులకు ఈ విశిష్టతను తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా ఉపాధ్యక్షురాలు గుండవరం సువర్ణ, మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు ఉప్పు సమత మాట్లాడుతూ.. ముగ్గులు ధార్మిక, సామాజిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నాయని, ముగ్గు వేసిన ఇంట్లోకి లక్ష్మీదేవి ప్రవేశిస్తుందని భక్తుల నమ్మకమని తెలిపారు. మహిళా కమిటీ సభ్యురాలు పట్నం శెట్టి సుమతి మాట్లాడుతూ.. బియ్యపు పిండితో ముగ్గులు వేయడం ద్వారా పక్షులకు ఆహారాన్ని అందించిన వారమవుతామని, ఇది మహిళలకు చక్కని వ్యాయామమని పేర్కొన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన ఉప్పు లావణ్య (ప్రథమ), ఎల్.సంధ్యారాణి (ద్వితీయ), ఉప్పు మంజుల (తృతీయ) బహుమతులు సాధించగా, మహాదేవుని మమత కన్సోలేషన్ బహుమతి అందుకున్నారు. పోటీలో పాల్గొన్న కొలగాని శోభ, ఉప్పు సమత, పట్నం శెట్టి రజిత, ఉప్పు సమన్విత, శ్రీహర్షినిలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా కే. అరుణ, కే.సంధ్యారాణి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం ప్రతినిధులు పట్నం శెట్టి వీర సోమయ్య, నానం రాజయ్య, గుండవరం విధుమౌళి, పట్నం శెట్టి శైలేష్ ప్రసాద్, కమ్మల సర్వేశ్వరరావు, ఉప్పు భాస్కర్, యూత్ కమిటీ ప్రతినిధులు ఉప్పు శివకుమార్ (సునీల్), కొలగాని సాయికుమార్, ఉప్పు ఆశిష్ తదితరులు పాల్గొన్నారు.

# 'వేగం వద్దు - ప్రాణం ముద్దు'




**వరంగల్ వాయిస్, కాజీపేట:** జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని కాజీపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం డీజిల్ కాలనీలో ఆటో డ్రైవర్లకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. బ్రహ్మకుమారి సంస్థ సహకారంతో "వేగం వద్దు – ప్రాణం ముద్దు.. ఆటో వాలే హై దిల్ వాలే" అనే నినాదంతో జరిగిన ఈ కార్యక్రమానికి వరంగల్ ట్రాఫిక్ డివిజన్ ఏసీపీ టి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కాజీపేట ట్రాఫిక్ సీఐ పిట్టల వెంకన్న మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. డ్రైవర్లు క్రమశిక్షణతో ఉండాలని, విధిగా యూనిఫామ్ ధరించి, లైసెన్స్‌తో పాటు ఆటో డాక్యుమెంట్లన్నీ సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. బ్రహ్మకుమారి సంస్థ ప్రతినిధి శ్రీదేవి దీదీ మాట్లాడుతూ.. పోలీసు శాఖ చేపట్టిన ఈ అవగాహన సదస్సు ఆటో డ్రైవర్లలో మానసిక పరివర్తనకు, బాధ్యతాయుతమైన ప్రయాణానికి దోహదపడుతుందని అభినందించారు. ఈ సదస్సులో పాల్గొన్న సుమారు 100 మంది ఆటో డ్రైవర్లు.. ట్రాఫిక్ నిబంధనలపై తమకు కలిగిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సమావేశంలో ట్రాఫిక్ ఎస్ఐలు శ్రావణ్ కుమార్, కనక చంద్రం, ఏఎంవీఐ బండి శ్రావ్య, తొమ్మిది ఆటో యూనియన్ల నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

# కరాటే పోటీల్లో రియాజ్, భరత్ యాదవ్‌ల జోరు

## విజేతలకు బహుమతులు అందజేత



**వరంగల్ వాయిస్,పరకాల:** క్రియేటివ్ కరాటే డో క్లబ్ 34వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక మయూరి గార్డెన్‌లో నిర్వహించిన రాజీవ్ గాంధీ మెమోరియల్ జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్షిప్ పోటీలు అత్యంత ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు తెలంగాణతో పాటు వివిధ ఎనిమిది రాష్ట్రాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు తరలివచ్చారు. ఆదివారం అర్ధరాత్రి వరకు కొనసాగిన ఈ హోరాహోరీ పోరులో గ్రాండ్ ఛాంపియన్లుగా సీనియర్స్ కటా విభాగంలో ఎండీ రియాజ్ పాషా, కుమితే విభాగంలో ఆర్.భరత్ యాదవ్ నిలిచి ట్రోఫీలతో పాటు నగదు బహుమతులను సొంతం చేసుకున్నారు. జూనియర్స్ విభాగంలో జమీల్, సాయి చరణ్, షణ్ముఖ, సహస్ర, మాన్యశ్రీ, వర్ధన్, శుక్లలు కటా–కుమితే విభాగాల్లో ఛాంపియన్లుగా నిలిచారు. సాయి తేజ, ప్రియాంష్, దీపక్, శివాన్స్, ప్రత్యూష రాజ్, విశ్వక్, అస్మిక, శ్రేష్ట, హిమ వర్షిని, సంజన తదితరులు వివిధ విభాగాల్లో బంగారు, వెండి పతకాలు సాధించారని నిర్వాహకులు మాడ విశ్వ శ్రీ, స్నిగ్ధిష్‌లు తెలిపారు. ఈ పోటీలను క్లబ్ అధ్యక్షులు సోదా రామకృష్ణ, ప్రముఖ వైద్యులు అభిరామ్ బాశెట్టి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు కట్కూరి దేవేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు కొయ్యడ శ్రీనివాస్ ప్రారంభించి, విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్ డైరెక్టర్‌గా మాడ సంపత్, చీఫ్ జడ్జ్‌గా పాపయ్య వ్యవహరించారు. టోర్నమెంట్ అబ్జర్వర్ కనకరాజు, రెఫరీలుగా సమ్మయ్య, చందు, జాహిద్, డాక్టర్ సీతారామ నాయక్, మరియమ్మ బాధ్యతలు నిర్వర్తించారు.

# మాట తప్పని సర్పంచ్

## హామీల అమలులో వంగపల్లి సర్పంచ్ మార్క్



**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** ఎన్నికల వేళ ఇచ్చే హామీలు అమలుకు నోచుకోని ఈ రోజుల్లో, వంగపల్లి నూతన సర్పంచ్ నకీర్త రాజు మాత్రం తాను ఇచ్చిన మాటను చేతల్లో చూపిస్తూ ప్రత్యేకత చాటుకుంటున్నారు. రాజకీయాలకు అతీతంగా ఆయన సాగిస్తున్న సంక్షేమ పాలన ఇప్పుడు గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, గ్రామంలోని ఇద్దరు ఆడపిల్లలకు తలా రూ.5,000 చొప్పున 'కానుక భరోసా' కార్డులను అందజేశారు. మాటకే పరిమితం కాకుండా, అధికారంలోకి రాగానే నగదు అందజేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకున్నారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు తక్షణ సహాయంగా రూ.5,000 అందజేస్తానని ఇచ్చిన మరో హామీని కూడా ఆయన అమలు చేశారు. ఇటీవల గ్రామంలో మరణించిన నాలుగు కుటుంబాలకు రూ.5,000 చొప్పున (మొత్తం రూ. 20,000) ఆర్థిక సహాయాన్ని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధులు అంటే కేవలం హామీల జాబితా కాదని, అమలుకు నిలువెత్తు ఉదాహరణ కావాలని అన్నారు. మాట నిలబెట్టుకుంటూ గ్రామస్తుల్లో నమ్మకాన్ని పెంచుతున్న సర్పంచ్ నకీర్త రాజు సేవలు అభినందనీయమని ప్రశంసించారు. సంక్షేమం, సానుభూతిని మేళవించి ముందుకు సాగుతున్న సర్పంచ్ పాలన కొత్త రాజకీయ సంస్కృతికి నాంది పలుకుతోందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వాల్మీకిల ఐక్యతతోనే సామాజిక అభివృద్ధి



**వరంగల్ వాయిస్, కాజీపేట :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన వాల్మీకి కులస్థులైన ప్రజా ప్రతినిధులు కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా సేవాభావంతో పనిచేసి ఆదర్శంగా నిలవాలని వాల్మీకి సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షులు భోగి కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వాల్మీకి బోయ పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాజీపేట మండలం మడికొండలో నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు 'విక్టరీ ఫెలిసిటేషన్' (సన్మాన ఉత్సవం) నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నిగ్గుల వెంకట ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్య అతిథులుగా భోగి కృష్ణమూర్తితో పాటు విద్యుత్ శాఖ డీఈ ఆవుల వెంకటయ్య, ప్రముఖ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భోగి మహేందర్ హాజరయ్యారు. అనంతరం విజయం సాధించిన ప్రజా ప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వాల్మీకి నాయకులు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన కులస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శ్రీరంగనాథ గోదాదేవి పూజలు



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గ్రామ సర్పంచ్ పర్వతగిరి మహేశ్వరి రాజు ఆధ్వర్యంలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ అర్చకులు ఆరుట్ల మాధవమూర్తి శ్రీరంగనాథ గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ పూజల్లో అయ్యప్ప, వెంకటేశ్వర స్వామి దీక్షాధారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు, నైవేద్యాలు సమర్పించిన అనంతరం దీక్షాధారులకు భిక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షాధారులు సంప్రదాయబద్ధంగా కూర్చుని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సీఐ సంతోష్, ఎస్సై తిరుపతి, ఉప సర్పంచ్ భాషబోయిన పైడిద్ద, పంచాయతీ కార్యదర్శి శ్వేత పాల్గొన్నారు. అలాగే ప్రముఖ న్యాయవాది టింగిలీకారి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పరికిరాల వాసు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఏరుకొండ రవీందర్ గౌడ్, నాయకులు తనుగుల సందీప్, భయ్యా కుమారస్వామి, కోల రమేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ట్రంప్ చర్యలు ప్రపంచ శాంతికి విఘాతం

◆ తక్కళ్లపల్లి శ్రీనివాసరావు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వెనిజులా దేశంపై అమెరికా అత్యంత పాశవికంగా దాడి చేసి, ఆ దేశ అధ్యక్షుడు నికోలస్ మదురోను, ఆయన భార్యను బంధించి న్యూయార్క్ తీసుకురావడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. సోమవారం వరంగల్ శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో ఎండీ అక్బర్ అధ్యక్షతన జరిగిన సీపీఐ జిల్లా విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ పోలీసులా వ్యవహరిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఒక స్వతంత్ర దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడం దారుణమని శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. వెనిజులాలోని అపారమైన చమురు సంపదను హస్తగతం చేసుకోవడానికే అమెరికా ఈ దాడులకు తెగబడిందని ఆరోపించారు. మదురో కుటుంబాన్ని వెంటనే విడుదల చేయాలని, అమెరికా నిరంకుశ చర్యలను భారతదేశం తీవ్రంగా వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. సామ్రాజ్యవాద శక్తుల అన్యాయాన్ని అడ్డుకోవడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా, రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి, పంజాల రమేష్ పాల్గొన్నారు. జిల్లా నాయకులు పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, గన్నారపు రమేష్, బుస్సా రవీందర్, గుండె బద్రి, తోట చంద్రకళ, తాళ్లపెల్లి రహేలా, ఆరెల్లి రవి, జన్ను రవి తదితరులు పాల్గొని తమ నిరసన వ్యక్తం చేశారు.

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జనవరి 05, 2026



# రాజకీయాల్లో రాణించాలి

- సర్పంచులుగా గుర్తింపు తెచ్చుకోవాలి
- గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి

**వరంగల్ వాయిస్, వరంగల్ :** పద్మశాలీలు కక్షలు, కార్పణ్యాలకు తావివ్వకుండా రాజకీయాల్లో రాణించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ మేయర్ గుండు సుధారాణి పిలుపు నిచ్చారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన పద్మశాలి ప్రజా ప్రతినిధులకు పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్, పద్మశాలి డాక్టర్స్ అసోసియేషన్, పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల విజయం సాధించిన వారికోసం 'విక్టరీస్ ఫెలిసిటేషన్' నిర్వహించారు. హంటర్ రోడ్ లోని వేద బంకెట్ హాల్ లో జరిగిన ఈ కార్యక్రమానికి పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు హాజరయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి నరెంద్ర కుమార్ విచ్చేశారు. ఈ సందర్భంగా మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్ పదవి కీలకమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రానున్న రోజుల్లో గ్రామ పంచాయతీలకు పెద్దపీట వేస్తుందని సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు ప్రజలకు మంచి సేవలు అందించాలని ఆమె కోరారు. రానున్న మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో మరింత ఉత్సాహంతో పద్మశాలీలు పోటీ చేసి గెలుపొందాలని గుండు సుధారాణి పిలుపు నిచ్చారు. పద్మశాలీలు రాజకీయంగా రాణిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. చట్ట సభల్లో పద్మశాలీలకు సరైన ప్రాతినిధ్యం లేదన్నారు. నూలు పోగు చిక్కుముడులు విప్పే నేర్పు ఉన్న పద్మశాలీలకు రాజకీయాలు చేయడం పెద్ద లెక్క కాదని ఆమె గుర్తు చేశారు. కాకపోతే పద్మశాలీలలో ఐక్యత కొరవడిందన్నారు. భవిష్యత్తులో ఐక్యమత్యంతో ముందుకు సాగాలని ఆమె కోరారు. కేంద్ర ప్రభుత్వం ఫైనాన్స్ నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేస్తుందని, అలాగే రాష్ట్ర ప్రభుత్వం నిధులు ఖర్చుచేసి ప్రాధాన్యం పనులు ఎంచుకొని పూర్తి చేయాలని ఆమె సూచించారు. ప్రజలు మీ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని గెలిపించారని వారి ఆశలకు అనుగుణంగా పని చేసి మంచి ప్రజా ప్రతినిధులుగా గుర్తింపు తెచ్చుకోవాలని గుండు సుధారాణి సూచించారు. ధీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి మీ నియోజకవర్గాల ఎమ్మెల్యేలా సహకారం తీసుకోవాలన్నారు. అందులో ఎలాంటి మొహమాటం ఉండకూడదన్నారు. వర్ధన్నపేట మాజీ శాసన సభ్యులు వన్నాల శ్రీరాములు మాట్లాడుతూ రాజకీయాల్లో గుండె ధైర్యం అవసరమన్నారు. అలాంటి గుండె నిబ్బరం చేసుకుని గ్రామ ప్రజా ప్రతినిధులుగా గెలిచి వచ్చినందుకు అభినందనలు తెలిపారు. పద్మశాలీలు చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించాలంటే స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులు ముఖ్య భూమిక పోషించాలని వన్నాల శ్రీరాములు పిలుపు నిచ్చారు. పద్మశాలీలు ఐక్యమత్యంగా సమన్వయంతో రాజకీయంగా ముందుకు సాగాలని వన్నాల సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. గ్రామ స్థాయిలో అనేక రాజకీయ ఈక్వేషన్స్ ఉంటాయని, వాటన్నింటిని గుండె ధైర్యంతో ఎదుర్కొంటేనే ప్రజలు హర్షిస్తారని వన్నాల అన్నారు. పద్మశాలీలు ఒకరిపై ఒకరు పోటీ చేసుకుని ఓడిపోయిన సందర్భాలు ఉన్నాయని, అలాంటివి భవిష్యత్తులో జరుగకుండా పద్మశాలి జర్నలిస్టుల సంఘం భాద్యత తీసుకోవాలని వరంగల్ జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు సూచించారు. పద్మశాలీలు ఎదిగినకొద్ది ఒదిగి ఉండాలని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్ కోరారు. ఎవరి పార్టీలు వారికి ఉంటాయని కులం విషయానికి వచ్చినప్పుడు అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని అఖిల భారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు గుండు ప్రభాకర్ పిలుపు నిచ్చారు. పద్మశాలి గ్రామ పంచాయతీ ప్రజా ప్రతినిధులకు పద్మశాలి ఉద్యోగుల సంఘం అండ దండలు అందిస్తామని, అందరు సక్రమ మార్గంలో పనిచేయాలని పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఈగ వెంకటేశ్వర్లు కోరారు. పద్మశాలీలు రాజకీయాల్లో కనువిప్పు తెచ్చుకోవాలని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా కో–ఆర్డినేటర్ వన్నాల నరేందర్ కోరారు. సీనియర్ జర్నలిస్టులు గడ్డం కేశవమూర్తి, మెండు రవిందర్, వల్లాల వెంకట రమణ, పద్మశాలి డాక్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, పద్మశాలి విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రి సతీష్ కుమార్, రామా రవిందర్, పోస్టల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొద్దుల వెంకటేశ్వర్లు తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు చెరుకు వేణుప్రసాద్, బండారి ప్రమోద్ కుమార్, దాసరి ధనుంజయ, వేముల సదానందం తదితరుల పాల్గొన్నారు.










# శక్తిగా తిరిగి వస్తా..

- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కేసీఆర్
- ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగంతో కన్నీరు
- కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ పార్టీపై కవిత వెల్లడి



**వరంగల్ వాయిస్ , హైదరాబాద్ :** వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తానంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ప్రకటించారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదంటూ ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బీజేపీ నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి చైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 3న చైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తున్నా.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ళ దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు. ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను.నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు. అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పింఛను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.



## ఐనవోలు జాతర గోడ పత్రికల ఆవిష్కరణ..

**వరంగల్ వాయిస్, ఐనవోలు:** ఈ నెల 11 నుంచి 18 వరకు జరిగే ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల గోడ పత్రికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం అసెంబ్లీలోని సీఎం ఛాంబర్ లో ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంచార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ లతో కలిసి వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఆలయ పాలకవర్గం ముఖ్యమంత్రిని కలిసి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా కోరారు. తొలుత మంత్రి సురేఖ స్వామి వారి శేషవస్త్రాన్ని సీఎం గారికి అందజేయగా, ఆలయ ప్రధాన అర్చకులు వేదమంత్రోచ్చారణలతో ఆశీర్వదించి, స్వామివారి చిత్రపటంతో పాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ కమ్మగోని ప్రభాకర్ గౌడ్, ఈవో సుధాకర్, అర్చకులు నరేష్, శ్రీనివాస్ తో పాటు నందనం గ్రామ సర్పంచ్ జెట్టబోయిన రాజు, మహమ్మద్ చోటే తదితరులు పాల్గొన్నారు.

## తగుల పెట్టొద్దు

- వరి, ప్రత్తి పంట అవశేషాలను కలియ దున్నడం ద్వారా విశేష లాభాలు
- జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పత్తి, వరి పంటల వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించడం ద్వారా భూసారాన్ని పెంచడంతోపాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించవచ్చని వరంగల్ జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ వెల్లడించారు. పంట వ్యర్థాలను కాల్చకుండ భూమిలో కలియబెట్టడం ద్వారా రైతుకు, నేలకు చాలా మేలు జరుగుతుందన్నారు. పత్తి, వరి కోత తర్వాత మిగిలిన వరి కొయ్య కాళ్ళు, ప్రత్తి మొళ్ళు వ్యర్థాలను చిన్న ముక్కలుగా శ్రేడ్డర్ ద్వారా కత్తిరించి లేదా రోటవేటర్ లేదా మల్చర్ వంటి యంత్రాలతో భూమిలో కలియదున్నాలని సూచించారు. వ్యర్థాలను త్వరగా కుళ్ళబెట్టడానికి, భూమిలో కలియబెట్టే ముందు సింగిల్ సూపర్ఫాస్ఫేట్ ఎకరాకు 50 కిలోల చొప్పున వాడడం ద్వారా లేదా బయోడీకంపోజ్ ఉపయోగించడం ద్వారా త్వరగా వ్యర్థాలను కుల్లింప చేయవచ్చన్నారు. ఇది కలుపు మొక్కలు పెరుగుదలను కూడా తగ్గిస్తుందన్నారు. దీని ద్వారా మొక్కలకు కావలసిన ప్రధాన పోషకాలు, సూక్ష్మ పోషకాలతోపాటు సేంద్రియ కర్బనము లభిస్తుందన్నారు. రసాయన ఎరువుల వినియోగం పెరిగి, సాగు ఖర్చును తగ్గించుకోవచ్చన్నారు. నేల ఉష్ణోగ్రతను నియంత్రిస్తుందని, తేమను సంరక్షిస్తుందన్నారు. భూమి కోతకు గురికాకుండా కాపాడుతుందన్నారు. రసాయన ఎరువులను తగు మోతాదులో తగ్గించి వాడడంతో సాగు ఖర్చు తగ్గుతుంది. పంట వ్యర్థాలను విలువైన వనరుగా మారుస్తుందన్నారు. కాలుష్యాన్ని నివారిస్తుందని తెలిపారు. భూసారం, సూక్ష్మజీవుల కార్యకలాపాలు పెరుగుతాయని, భూమి నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుందని, తద్వారా నీటిపారుదల అవసరం తగ్గుతుందన్నారు. భూమిలో ఉండే మేలు చేసే సూక్ష్మజీవులు, వానపాములు చనిపోతాయని, గాలి కాలుష్యం పెరుగుతుందని, ఇది ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. భూమి సహజ సారం తగ్గిపోతుందని, పంట వ్యర్థాలను కాల్చకుండా, భూమిలో కలియదున్నడం పాటించడం ద్వారా రైతులు లాభపడటమే కాకుండా, పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడి అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ అధికారి అనురాధ తెలిపారు.

## పద్మశాలి కుటుంబాలను ఆదుకోవాలి

☐ అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు



**వరంగల్ వాయిస్, హసన్ పర్తి :** ఘర్ వాపసి కింద తిరిగి వచ్చిన పద్మశాలి కుటుంబాలను ఆదుకోవాలని అసెంబ్లీ వేదికగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రభుత్వాన్ని కోరారు. వర్ధన్నపేట నియోజకవర్గంలోని పద్మశాలి కులస్తులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లకుండా వారికి భరోసా కల్పించాలన్న ఉద్దేశంతో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఘర్ వాపసి పథకం కింద మడికొండ శివారులో టెక్స్ టైల్ పార్కు ఏర్పాటుచేసి అనేకమంది పద్మశాలి కుటుంబాలకు స్థలాలు కేటాయించి అన్ని విధాల ప్రోత్సహించారని గుర్తు చేశారు. కానీ గత 15 సంవత్సరాలుగా టెక్స్ టైల్ పార్కులోని పద్మశాలి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. ముఖ్యంగా పవర్ మిల్లులకు నిరంతరం విద్యుత్తు సరఫరా లేకపోవడంతో వారి జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఈ సమస్యను అసెంబ్లీ వేదికగా సంబంధిత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. గర్ వాపసి కింద వచ్చిన పద్మశాలి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని కేఆర్ నాగరాజు విజ్ఞప్తి చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com